
ఉత్సవాల ప్రారంభం సందర్భంగా భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

## వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చిక్కడపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని సుప్రసిద్ధ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పూజా కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయులు పర్యవేక్షించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్, హైదరాబాద్ సిటీ 1 పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు విజయభాస్కర్, ప్రేమానందపాయ్ తెలిపారు. బర్కత్‌పుర బస్‌డిపో, దోమగలగూడ పరిధిలో ఉదయం 11 నుంచి 12.30 వరకు, సీసీష్రాఫ్, గగన్‌మహల్ పరిధిలో 12.30 నుంచి 2 గంటల వరకు, బౌద్ధనగర్, దత్తానగర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 4గంటల వరకు, జామైఉస్మానియా, మెహఫిల్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

## రేపు భాస్కరరెడ్డి స్వర్ణోత్సవం

చిక్కడపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాలుగా సంగీత సేవ చేస్తున్న బొబ్బిలి భాస్కరరెడ్డి స్వర్ణోత్సవాన్ని ఈనెల 24న త్యాగరాయగానసభలో నిర్వహిస్తున్నామని జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ జి.వెంకటరెడ్డి తెలిపారు. ఘంటసాల సంగీత పురస్కారాన్ని భాస్కరరెడ్డికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రమణాచారి ప్రదానం చేస్తారని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## పాతకక్షలతో ఇద్దరు రౌడీషీటర్లపై దాడి

### డబీర్‌పుర రైల్వేస్టేషన్‌లో ఘటన

హైదరాబాద్ సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): డబీర్‌పుర రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారంపై పాతకక్షలతో ఇద్దరు రౌడీషీటర్లపై దాడి చేశారు. ఈ సంఘటన కాచిగూడ రైల్వేపీఎస్ పరిధిలో జరిగింది. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మాదన్నపేటకు చెందిన ఫయాజ్, డబీర్‌పుర చెందిన మోసిన్ స్నేహితులు. ఇద్దరిపై రౌడీషీట్ ఉంది. ఈ ఇద్దరికీ దబీర్‌పురాకు చెందిన రెహన్, దావూదుతో పాత కక్షలు ఉన్నాయి. బుధవారం రాత్రి డబీర్‌పుర రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం 1లో ఈ నలుగురు ఎదురుపడ్డారు. దీంతో రేహన్, దావూద్ కత్తులతో దాడికి దిగారు. ఈ దాడిలో ఫయాజ్, మోసిన్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వారిద్దరునీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వారి ఫిర్యాదు మేరకు రేహన్, దాహుద్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.


పాన్‌షాపు నిర్వాహకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న కాచిగూడ ఏసీపీ రఘు

## పాన్‌షాపు యజమానులు డ్రగ్స్ విక్రయిస్తే కఠిన చర్యలు : ఏసీపీ

బర్కత్‌పుర, మే 22 (ఆంధ్రజ్యోతి): పాన్‌షాపు యజమానులు పొగాకు ఉత్పత్తులు, నార్కోటిక్స్ డ్రగ్స్, ఈ సిగరెట్లను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాచిగూడ ఏసీపీ రఘు హెచ్చరించారు. బుధవారం కాచిగూడ పీఎస్‌లో పాన్‌షాపు యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయపాలన పాటించాలని, రాత్రి 11 గంటలలోపే పాన్‌షాపులను మూసివేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ సీఐ లక్ష్మీకాంతరెడ్డి, అడ్మిన్ ఎస్ఐ కె.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.


ముషీరాబాద్‌లో రోడ్డుమార్గాన్ని పరిశీలిస్తున్న సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ యర్రా, సీఐ వీరేశం

## ముషీరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ముషీరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ చౌరస్తా నుంచి రాజాడీలక్స్ చౌరస్తా వరకు మెట్రోలైన్ రోడ్డు మార్గంలో 1000 ఎంఎం డయా మంచి నీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను జలమండలి అధికారులు చేపట్టనుండడంతో వాహనాల రాకపోకలను దారిమళ్లించేందుకు బుధవారం సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ యర్రా, ట్రాఫిక్ సీఐ వీరేశం తదితరులు ముషీరాబాద్ చౌరస్తా నుంచి రాజాడీలక్స్ చౌరస్తా, దాయారం మార్కెట్ చౌరస్తా వరకు పర్యటించి వాహనాల దారి మళ్లింపుపై చర్యలు చేపట్టారు. వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా వాహనాల దారిమళ్లింపుపై తీసుకోవల్సిన జాగ్రత్తలకోసం అధికారులు రూట్‌మ్యాప్ తయారు చేశారు. త్వరలో పనులు ప్రారంభం కానుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఏసీపీ యర్రా తెలిపారు.


జైసింహను సన్మానిస్తున్న ముఠా గోపాల్

## కార్యకర్తలు పార్టీకి పునాది : ఎమ్మెల్యే గోపాల్

చిక్కడపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు పార్టీకి పునాది అని ముషీరాబాద్‌ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేష్ ఆధ్వర్యంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ, హారిక దంపతులను ఎమ్మెల్యే సన్మానించారు. ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ జైసింహ దంపతులు ఆలయాల పునరుద్ధరణ, ఆలయాల అభివృద్ధితోపాటు నిరుద్యోగులకు ఉపాధి పథకాలు అందేవిధంగా చూడడం, పేదలకు ఆర్థిక సహకారం అందిస్తున్నారని అభినందించారు. పార్టీ డివిజన్ ప్రధానకార్యదర్శి శ్రీకాంత్, సత్యనారాయణరామ్, శ్రీనివాస్‌గుప్త, పాశంరవి, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రేమేందర్‌రెడ్డి విజయం తథ్యం


ఇంజనీరింగ్ కళాశాలలో ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు

బర్కత్‌పుర, మే 22 (ఆంధ్రజ్యోతి): నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి విజయం తథ్యం అని ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు ధీమా వ్యక్తంచేశారు. ఉమ్మడి మూడు జిల్లాల్లో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల్లో ఈ నెల 26 వరకు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం నగర శివారులోని ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు గిరివర్ధన్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఇదేం ప్యాచ్‌వర్క్?

- వర్షాల వల్ల గోతులుపడి ప్రమాదకరంగా మారిన రోడ్లు
- జలమండలి, జీహెచ్ఎంసీ సమన్వయలోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు

రాంనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): జలమండలి, జీహెచ్ఎంసీ అధికారుల సమన్వయలోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. డ్రైనేజీ పైప్‌లైన్లను నిర్మించి తవ్వినచోట రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులను చేయకుండా వదిలేశారు. దీంతో గోతులు పడిన రోడ్ల వల్ల వాహనదారులు, పాదచారులు, ప్రజలు ప్రమాదలకు గురువుతున్నారు. ఆరు నెలల క్రితం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ నియోజకవర్గం అభివృద్ధి నిధులు(సీడీపీ) కింద ఈ పనులు చేయలేదు. ముఖ్యంగా అడిక్‌మెట్ డివిజన్‌లోని సౌమ్య ఆస్పత్రి పక్క వీధి నుంచి రామాలయం వెళ్లే స్ట్రీట్ నెంబర్ 18లో డ్రైనేజీ లైన్ వేసేందుకు ఆరు నెలల క్రితం తవ్వకాలు జరిపి లైన్లు నిర్మించారు. కానీ పైప్‌లైన్ వేసిన చోట రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు చేయలేదు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో కొత్తలైన్ వేసినచోట పోసిన మట్టి కుంగిపోయి గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు, పాదచారులు వాటిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అదేవిధంగా ఆజామాబాద్‌లోని ట్రాన్స్‌కో జెంక్షన్ నుంచి వీఎస్టీ పార్కు ముందు నుంచి సరోజిని క్రికెట్ అకాడమీ వరకు వేసిన డ్రైనేజీ లైన్ ప్రాంతంలో కూడా ప్యాచ్ వర్క్ చేయలేదు. ఈ ప్రాంతంలో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్యను సంబంధిత జలమండలి చిలకలగూడ డీజీఎం మోహన్‌రావు, స్థానిక మేనేజర్లు శివసాయి, జ్యోతిలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



రాంనగర్ స్ట్రీట్ నెంబర్ 18లో డ్రైనేజీ పైప్‌లైన్ వేసి ప్యాచ్‌వర్క్ పనులు చేయకుండా వదిలివేసిన దృశ్యం


వీఎస్టీపార్కు మెయిన్ రోడ్డులో ప్యాచ్‌వర్క్ పనులు చేయకుండా వదిలివేసిన దృశ్యం

### వెంటనే ప్యాచ్‌వర్క్ చేయాలి



రాంనగర్‌లోని స్ట్రీట్ నెంబర్ 18లో డ్రైనేజీ లైన్ కోసం తవ్వకాలు జరిపి లైన్‌వేసి ఆరు నెలలు పూర్తయిన ఇప్పటి వరకు ప్యాచ్ వర్క్ పనులు చేయలేదు. దీంతో వాహనదారులు, పాదచారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వృద్ధులు మరింత ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు పూర్తి చేయాలి

- గురుదత్త, రాంనగర్ నివాసి

### చర్యలు చేపడతాం



సీడీపీ నిధులతో ఈ పనులు చేయడం జరిగింది. జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ ప్యాచ్‌వర్క్ పనులు చేయాల్సి ఉంది. ఈ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లి త్వరలో పనులను పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగిస్తాం.

- మోహన్‌రావు, చిలకలగూడ జలమండలి డీజీఎం

# ఆహారకల్తీని నిరోధించాలి

### వినియోగదారుల మండలి వినతి


డిప్యూటీ కంట్రోలర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వినియోగదారుల మండలి ప్రతినిధులు చక్రపాణి తదితరులు

చిక్కడపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఆహార కల్తీని అరికట్టాలని వినియోగదారుల మండలి ప్రతినిధులు రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వినియోగదారుల మండలి జాతీయ ప్రధానకార్యదర్శి సాంబరాజు చక్రపాణి, పల్లెపాడు దామోదర్, శంకర్ లాల్ చౌరాసియా తదితరులు బుధవారం రాష్ట్ర ఆహార కల్తీ నిరోధక శాఖ కార్యాలయంలో డిప్యూటీ కంట్రోలర్ విజయకుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చక్రపాణి, దామోదర్ మాట్లాడుతూ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం ఆహారకల్తీ సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ప్రతి చోటా టాస్క్‌ఫోర్స్ దాడుల్లో భయంకర ఆహారకల్తీ సంఘటనలు వెలుగులోకి వస్తున్న క్రమంలో ఆహారకల్తీ నిరోధానికి వినియోగదారుల సంఘాలతో కలిసి జిల్లా స్థాయిలో ప్రత్యేక నిఘా విభాగాలు ఏర్పాటు చేయాలని కోరారు. 24 గంటల వరకే నాణ్యతగా ఉండే పాలను రెండు లేదా మూడు రోజుల వరకు నాణ్యతగా ఉండడానికి హైడ్రోజన్ పెరాక్సైడ్ రసాయనాలు కలపడం సర్వసాధారణమైపోయిందనిన్నారు. పసుపులో లెడ్‌క్రోమేట్ కలపడం వల్ల కేన్సర్ వ్యాధులు విజృంభిస్తున్నాయని వివరించారు. వినియోగదారుల్లో ఆహార కల్తీ పట్ల చైతన్యం కూడా నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉందని ఆహారకల్తీ నిరోధకశాఖ డిప్యూటీ కంట్రోలర్ వివరించినట్లు వారు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని హోటళ్లలో కల్తీ అరికట్టేటటువంటి బాధ్యత ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లను అప్రమత్తం చేయాలని కోరామన్నారు. దీనికి ఆయన స్పందించి తక్షణచర్యలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు.


రాజాడీలక్స్ చౌరస్తా వద్ద నిత్యం నిలిచిపోతున్న డ్రైనేజీ, వర్షం నీరు

## నిత్యం నిలిచిపోతున్న డ్రైనేజీ, వర్షం నీరు

### జీహెచ్ఎంసీ, జలమండలి అధికారుల సమన్వయ లోపం

ముషీరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లోని రాజాడీలక్స్ చౌరస్తా వద్ద నిత్యం డ్రైనేజీ, వర్షం నీరు నిలిచిపోతోంది. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్రఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో చౌరస్తా వద్ద రోడ్డు గుంతల మయంగా మారి వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. సాయిరాజా సినిమా థియేటర్ పక్కన డ్రైనేజీ మ్యాన్‌హోల్ నించి మురుగునీరు ఏరులై పారుతూ రాజాడీలక్స్ చౌరస్తా వరకు వచ్చి నిలిచిపోతోంది. అలాగే బాకారం నుంచి వచ్చే డ్రైనేజీ, వర్షం నీరు సైతం రాజాడీలక్స్ చౌరస్తా వద్ద నిలుస్తోంది. రాజాడీలక్స్ చౌరస్తా లోతట్టుగా ఉండడంతో ఇరుపక్కల నుంచి వచ్చే నీరు అక్కడే నిలిచిపోయి, సమస్యకు దారితీస్తున్నది. స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ పైప్‌లైన్ మంజూరు కానందున రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా రోడ్డు వేయలేకపోతున్నారు. రెండు ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


మాట్లాడుతున్న అడ్వకేట్ జేఏసీ కార్యనిర్వాహక కార్యదర్శి కనకయ్య

## తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దతు

### - తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జేఏసీ

బర్కత్‌పుర, మే 22 (ఆంధ్రజ్యోతి) : నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జేఏసీ వెల్లడించింది. పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో ఉన్న న్యాయవాదులందరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడ్వకేట్ జేఏసీ కో-ఆర్డినేటర్ వెంకటేష్ ఇంద్రపల్లి, కార్యనిర్వాహక కార్యదర్శి దమ్మిగారి కనకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు పంతం రాజేష్, గుంపుల శ్రీకాంత్‌యాదవ్‌లు మాట్లాడారు. తీన్మార్ మల్లన్నను గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని కోరారు. రాష్ట్రాన్ని, దేశాన్ని దోపిడీకి గురిచేసిన బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులను చిత్తుగా ఓడించి, మోదీ, కేసీఆర్‌కు బుద్ధిచెప్పాలని వారు పిలుపునిచ్చారు. ఆయా జిల్లాల్లో ఉన్న పట్టభద్రులు, న్యాయవాదులను కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో జేఏసీ కన్వీనర్ బత్తుల కృష్ణ, కో-కన్వీనర్లు మంజుల విజయకుమారి, కేశవరావు, జాయింట్ సెక్రటరీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమించి పెళ్లి చేసుకొని మోసం చేశాడు

- భర్త ఇంటి ఎదుట భార్య నిరసన


అత్తింటి ఎదుట వంటవార్పుతో ఆందోళన చేస్తున్న మహిళ

రాజాపేట, మే 22: ప్రేమించి పెళ్లి చేసుకొని మోసం చేశాడని భార్య భర్త ఇంటి ఎదుట ఆందోళన చేసింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన రేకులపల్లి మహిపాల్ రెడ్డి హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. హైదరాబాద్‌లోని రామాంతపూర్‌కు చెందిన యువతితో 2021లో ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. 2021 జూన్ 6వ తేదీన సింహాచలం దేవస్థానంలో ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. కొంతకాలం హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉంటూ కుటుంబ సభ్యుల సమక్షంలో మరోసారి పెళ్లి చేసుకున్నారు. యువతి నుంచి 24 తులాల బంగారం, రూ.70లక్షల నగదుతోపాటు మోత్కూరులో ఉన్న ప్లాట్లు తీసుకొని తనకున్న అప్పులు తీర్చుకున్నాడు. 15 రోజుల తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. తనను మోసం చేశాడని హైదరాబాద్‌లోని అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. కొంత కాలంగా మహిపాల్‌రెడ్డి మొహం చాటేస్తుండడంతో తనకు న్యాయంచేయాలని మహిపాల్‌రెడ్డి స్వగ్రామమైన బూరుగుపల్లిలోని మహిపాల్‌రెడ్డి ఇంటిముందు వంటా వార్పుతో కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం నిరసన దీక్ష చేపట్టింది. మహిపాల్‌రెడ్డి తల్లి పద్మ రెండు రోజుల క్రితం ఇంటికి తాళంవేసి తన బంధువుల ఇంటికి వెళ్లింది. దీంతో ఇంటి ముందు నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్థులు, కొంతమంది నాయకులు యువతీ దీక్షకు సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దీక్ష విరమింపజేసేందుకు యత్నించారు. గురువారం మహిపాల్‌రెడ్డిని రప్పించి న్యాయం చేస్తామని ఎస్ఐ సుధాకర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో యువతి కుటుంబ సభ్యులు దీక్షను విరమించారు.


స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

## ఘనంగా శ్రీనృసింహ జయంతి వేడుకలు

అంబర్‌పేట, మే 22 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డీడీ కాలనీలోని శ్రీఅహోబిలమఠంలో శ్రీనృసింహ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మఠంలో సుప్రభాతం అభి గమన ఆరాధన సేవా కాలం విశేష నృసింహ తిరు మంజనం ఆరాధన అర్చన సత్తుముర్రై, తీర్థప్రసాద గోష్ఠి తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం డోలోత్సవం సహస్రనామ పారాయణం అర్చనపానకారాధన హారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు పూజలకు హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా మఠంసిబ్బంది పటిష్ఠమైనచర్యలు తీసుకున్నారు.

## పీడీఎస్‌యూ నేతపై పూసపల్లి కుట్రకేసును ఉపసంహరించుకోవాలి

నల్లకుంట, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి తదితరులపై ఇల్లందు పోలీసులు పూసపల్లి కుట్ర కేసును మోపడాన్ని సంఘం జాతీయ ఆర్గనైజింగ్ కన్వీనర్ ఎం.రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. తక్షణమే కేసును ఉపసంహరించుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విద్యానగర్‌లోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాల పట్ల విద్యార్థుల పక్షాన నిస్వార్థంగా పీడీఎస్‌యూ పోరాటం చేస్తుందన్నారు. పీడీఎస్‌యూ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం మోపిన తప్పుడు కేసు నుంచి వారి పేర్లను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.



కేసును ఉపసంహరించుకోవాలని వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

## పీడీఎస్‌యూ గ్రేటర్ నేతల ఆధ్వర్యంలో..

రాంనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. వెంకటరెడ్డిపై మోపిన పూసపల్లి కుట్ర కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ నాయకులు ధరణి, సుమన్, మిశ్రిన్, సుల్తానాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ఎం.వెంకటరెడ్డిపై మోపిన కేసును ఉపసంహరించుకోవాలని కోరుతూ రూపొందించిన వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. వెంకటరెడ్డిపై కుట్ర కేసును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## భార్యతో గొడవపడి వెళ్లిపోయిన భర్త


రాజన్ పాశ్వాన్

బర్కత్‌పుర, మే 22 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి ఓ భర్త ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ కె.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజన్‌పాశ్వాన్(24) తన భార్య అంబిక పాశ్వాన్‌తో కలిసి నగరానికి వచ్చి కాచిగూడ పీఎస్ పరిధిలోని ఇసామియాబజార్‌లో నివాసం ఉంటున్నాడు. మూడేళ్ల క్రితం వీరికి వివాహం జరిగింది. రాజన్‌పాశ్వాన్ గోకుల్ ధామ్ వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 14న కారు డ్రైవర్ డ్యూటీ అయినపోయిన తర్వాత రాజన్‌పాశ్వాన్ ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. వివిధ ప్రాంతాలలో వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. దీంతో భార్య బుధవారం కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ తెలిపారు.

## సమ్మర్ ఉత్సవ్ మేళాలో సందడే సందడి


మేళాలో కశ్మీర్ ప్రకృతి సోయగాలు

ఖైరతాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నో రోజులుగా నగరవాసులు ఎదురుచూస్తున్న సమ్మర్ ఉత్సవ్ మేళా బుధవారం ప్రారంభమైంది. ప్రతి ఏటా ఓ వైవిధ్యతతో తయారయ్యే ఈ మేళాలో ఈసారి చల్లటి కశ్మీర్‌లో విహరించిన అనుభూతి కలిగేలా చేసిన ఏర్పాట్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మంచు పడుతున్న చలి నుంచి వెళ్తున్న అనుభూతి కలిగేలా ఏర్పాటైన టన్నెల్ మరింత ఆకట్టుకుంటోంది. దీంతోపాటు అమ్యూజ్‌మెంట్ రైడ్లు, పలు రాష్ట్రాల నుంచి వచ్చిన వర్తకులు తమ స్టాళ్ల ద్వారా ఎన్నో రకాల వస్తువులు, హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ వస్తువులను విక్రయానికి ఉంచారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన తిను బండారాలతో కూడిన వాటిని ఇష్టంగా ఆరగిస్తూ కుటుంబ సమేతంగా సందర్శకులు సమ్మర్ ఉత్సవ్ మేళాలో సందడి చేస్తున్నారు. ఐమాక్స్ పక్కనున్న హెచ్ఎండీఏ ఖాళీప్రదేశంలో ఈ ప్రదర్శన రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఉంటుందని నిర్వాహకుడు మీర్జా రఫిక్‌బేగ్ తెలిపారు.

## నర్సాపూర్‌లో మహారాష్ట్ర పోలీసుల సోదాలు

మర్పల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కేఫే బాంబు పేలుళ్లకు సంబంధం ఉందని అనుమానిస్తున్న ఓ వ్యక్తిని వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘటన మరువకముందే మర్పల్లి మండలం, నర్సాపూర్ శివారులోని ఓ రహస్య స్థలంలో నిషేధిత మత్తుపదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతో మహారాష్ట్ర పోలీసులు సోదాలు నిర్వహించడం కలకలం రేపింది. నర్సాపూర్ గ్రామంలో చెరువు పక్కనే ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రంలో నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతో మహారాష్ట్ర పోలీసులు బుధవారం తెల్లవారుజామున ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మహారాష్ట్ర పోలీసులు రేకుల షెడ్డులో మూడు లీటర్ల వరకు ద్రవమత్తు పదార్థంతోపాటు నిషేధిత మత్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. తహసీల్దార్ కార్యాలయ అధికారులను సంప్రదించి వివరాలు సేకరించారు. మత్తు పదార్థాలు సరఫరా చేసే వ్యక్తుల ద్వారా రాబట్టిన సమాచారం మేరకే మహారాష్ట్ర పోలీసులు ఇక్కడకు వచ్చినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే, రేకుల షెడ్డు వద్దకు పోలీసులు వచ్చిన విషయాన్ని పసిగట్టిన అక్కడున్న ఓ వ్యక్తి చెరువులో దూకి అక్కడి నుంచి పారిపోయినట్లు తెలుస్తోంది. కాగా, పారిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యుల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని కొంత సమాచారం సేకరించి అతడిని వదిలేశారు. స్వాధీనం చేసుకున్న సామగ్రిని ఓ వాహనంలో తమవెంట మహారాష్ట్రకు తరలించారు. ఈ సంఘటనపై జిల్లా, స్థానిక పోలీసులకు సమాచారం లేకపోవడం గమనార్హం.